వెంటాడుతున్న విద్యుత్ సమస్యలు

- లో ఓల్టేజీతో సతమతం
- కాలిపోతున్న గృహోపకరణాలు
- 120 కుటుంబాలున్నా సింగిల్ ఫేజే దిక్కు
- త్రీఫేజ్ కోరుతున్నా పట్టించుకునే వారు కరువు

గండవరం పంచాయతీ దర్గా సంఘం గ్రామాన్ని విద్యుత్ సమస్యలు వెంటాడుతోంది. ఎప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందో తెలియదు. తరచూ లో-ఓల్టేజీతో ఇంట్లోని ఎలక్ట్రిక్ గృహోపకరణాలకు దినదిన గండమే. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లు కావడంతో ఏడాదికి ఒకట్రెండు పర్యాయాలు కాలిపోతున్నాయి. ఇలా జరిగితే పునరుద్ధరణకు కనీసం రెండ్రోజులు పడుతుండడంతో గ్రామస్తులు అంధకారంలో ఉండిపోతున్నారు.



దర్గా సంఘంలో విద్యుత్ స్తంభం వాలిపోవడంతో కిందికి వేలాడుతున్న తీగలు

కొడవలూరు: మండలంలోని గండవరం పంచాయతీ పరిధిలో ప్రధాన గ్రామానికి అత్యంత సమీపంలో ఉన్న దర్గా సంఘంలో 120 కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి కేవలం సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా మాత్రమే ఇస్తున్నారు. గతంలో ఇక్కడ కేవలం 40 నుంచి 50 కుటుంబాలు మాత్రమే ఉండేవి. కాలక్రమేణ పెరుగుతూ వచ్చాయి. అప్పట్లో తక్కువ కుటుంబాలే కావడంతో రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఇప్పుడు కుటుంబాల సంఖ్య పెరగడంతో పాటు విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో గ్రామంలో లో ఓల్టేజీ సమస్య తీవ్రమైంది. ఫలితంగా ఇళ్లలోని విలువైన ఫ్రిడ్జ్, టీవీ, ఫ్యాన్, మిక్సీల్లాంటి వస్తువులు కాలిపోతున్నాయి. బల్బులు కాలిపోవడమైతే తరచూ జరుగుతూనే ఉంటుంది.

శిథిలావస్థలో స్తంభాలు

విద్యుత్ స్తంభాలు ఎప్పుడో వేసినవి కావడంతో శిథిలావస్థకు చేరాయి. గ్రామంలోని రోడ్లు పెరుగుతూ రావడంతో ఈ స్తంభాలు పల్లంలో ఉండిపోయాయి. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ప్రమాద భరితంగా వేలాడుతున్నాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో రెండేళ్ల క్రితమే స్తంభాల పునరుద్ధరణకు అంచనా వేశారు. కానీ ఆ అంచనాలు మరుగున పడ్డాయి.



గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్



తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు

నాలుగేళ్లుగా మొరపెట్టుకుంటున్నా..

గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇచ్చి వాటికి సరిపడా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు నాలుగేళ్లుగా విద్యుత్ శాఖ అధికారులను కోరుతూనే ఉన్నారు. ఎన్నిసార్లు అడిగినా స్పందన లేకపోవడంతో గత రెండు సర్వసభ్య సమావేశాల్లో ఈ సమస్యపై ప్రశ్నించారు. గత సమావేశంలోనైతే దీనిపై గట్టిగా నిలదీశారు. దీంతో నెలరోజుల్లోనే త్రీఫేజ్ సరఫరా ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చారు. రెండు నెలలు గడిచినా ఆ దిశగా ప్రయత్నాలు జరగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

అల్లాడిపోతున్నాం



కొన్నేళ్లుగా లో ఓల్టేజీతో అల్లాడిపోతున్నాం. ఎప్పుడు అంతరాయాలు ఉంటుందో తెలియడం లేదు. ఇంట్లో విలువైన ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించాలంటే భయమేస్తోంది. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతున్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు రెండ్రోజులు పడుతుండడంతో అంధకారంలో ఉండాల్సి వస్తోంది.

– ఎందోటి వెంకయ్య, గండవరం దర్గా సంఘం, కొడవలూరు మండలం

అంచనా వేసి వదిలేశారు



ఎన్నో ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు కావడంతో శిథిలావస్థకు చేరాయి. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ప్రమాద భరితంగా వేలాడుతున్నాయి. రెండేళ్ల క్రితం విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు అంచనా వేశారు. సమస్య పరిష్కారమవుతుందని భావించాం. కానీ అవి బుట్టదాఖలయ్యాయి.

– గొట్టిపూడి శ్రీనివాసులు, గండవరం దర్గా సంఘం, కొడవలూరు మండలం

క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు



విద్యార్థినులతో టీచర్లు

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటారు. సోమవారం స్కూల్లో వారిని ప్రధానోపాధ్యాయురాలు శైలజ, టీచర్లు అభినందించారు. ఈనెల 16 నుంచి గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. 69 కేజీ విభాగంలో కీర్తన, 63 కేజీల్లో కె.హనీ వెండి పతకాలు, 53 కేజీల విభాగంలో లీల, 60 కేజీల విభాగంలో జయశ్రీ రజత పతకాలు సాధించినట్టు పీడీ దేవి వెల్లడించారు.

పూడిపర్తి మహిళల ప్రతిభ



వెంకటాచలం: ఈషా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెంలో ఆదివారం నిర్వహించిన వివిధ పోటీల్లో వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రామానికి చెందిన మహిళలు ప్రతిభ చూపారు. ముగ్గుల పోటీల్లో నాశిన కీర్తి ప్రథమ స్థానం, లెమన్ అండ్ స్పూన్‌లో శ్రీలత ప్రథమ స్థానం, కీర్తి ద్వితీయ స్థానంలో వచ్చారు. త్రోబాల్ పోటీల్లో పూడిపర్తి జట్టుకు తృతీయ స్థానం లభించింది. వీరిని సోమవారం గ్రామస్తులు అభినందించారు.

ముత్తుకూరు ఎస్సైగా ప్రసాద్‌రెడ్డి



ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు ఎస్సైగా కె.ప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన విశ్వనాథ్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లారు. దీంతో కొద్దిరోజులుగా ముత్తుకూరు ఎస్సై బాధ్యతలను కృష్ణపట్నం పోర్టు ఎస్సై శ్రీనివాసులురెడ్డి నిర్వహిస్తున్నారు. ప్రసాద్‌రెడ్డి నెల్లూరు రూరల్ నుంచి ముత్తుకూరు స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

సురవరం పోరాటాలు మరువలేం




మాట్లాడుతున్న నాయకులు

ముత్తుకూరు(పొదలకూరు): ప్రజల కోసం సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి చేసిన పోరాటాలు మరువలేమని మత్తుకూరు మండల నాయకులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సంతాపసభను నిర్వహించి మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి పనిచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏడుకొండలు, ముజీబ్‌బాషా, ప్రవీణ్, షణ్ముఖం, ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్జీఓ కాలనీలో రాజేశ్వరి కుటుంబం నివాసం ఉంటోంది. ఈనెల 23న ఆమె తన కుటుంబంతో కలిసి సైదాపురం మండలం చికవోలు గ్రామంలో దేవుని కల్యాణానికి వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 72 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇంట్లో ఉన్న సుమారు 500 గ్రాముల వెండి వస్తువులను అపహరించుకుని వెళ్లారు. రాజేశ్వరి కుటుంబం 24వ తేదీ రాత్రి ఇంటికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించి సోమవారం వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పెంచలకోనలో మృతదేహం లభ్యం



రాపూరు: మండలంలోని పెంచలకోన అటవీశాఖ అతిథి గృహం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు సోమవారం ఉదయం మృతదేహాన్ని చూసి పెంచలకోనలోని అవుట్‌పోస్టుకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అతని వయసు సుమారు 45 ఏళ్ల వయసుంటుందని చెప్పారు. సమీపంలో గడ్డిమందు బాటిల్ ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిస్తే రాపూరు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీ

పొదలకూరు: కొత్తగా రేషన్‌కార్డులను అధికారులు సోమవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి సివిల్ సప్లైస్ డీటీ ఇండ్ల రవి స్థానిక అధికార పార్టీ నాయకుల చేతుల మీదుగా కార్డులను వినియోగదారులకు అందజేశారు.

➡ కొడవలూరు: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డులను మండలంలోని గండవరంలో పంపిణీ చేశారు. వీటిని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. సర్పంచ్ బి.రాజకుమారి, ఉపసర్పంచ్ ఆలం మాలకొండయ్య, వీఆర్వో షరీఫ్, స్థానిక నాయకుడు ముజీర్ పాల్గొన్నారు.

➡ మనుబోలు: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం కూటమి నాయకుల చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. డీటీ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఐ అరుణ్‌తేజ్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు(పొదలకూరు): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగంలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని కాశీపాళెం-2 రేషన్‌షాపు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు సోమవారం అందజేశారు.

సెప్టెంబర్‌లో పోషకాహార మాసోత్సవాలు

నెల్లూరు(పొగతోట): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వచ్చే నెల 1 నుంచి 30వ తేదీ వరకు పోషకాహార మాసోత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారంపై తల్లులకు అవగాహన కల్పిస్తామన్నారు.

'నాకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేశారు'

- కోవూరు సబ్ రిజిస్ట్రార్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మహిళ

నెల్లూరు(అర్బన్): నేను అద్దెకు ఇచ్చిన ఇంటిని నాకు తెలియకుండా ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా వేరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన కోవూరు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు అందుకు సహకరించిన పంచాయతీ కార్యదర్శి బ్రహ్మారెడ్డిపై కఠినమైన చర్యలు చేపట్టాలని బాబావలీ అనే మహిళ కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె నెల్లూరు నగరంలో కలెక్టర్ ఆనంద్‌కు అర్జీ ఇచ్చి, మాట్లాడారు. తాను గండవరం పంచాయతీలో 2015లో మోహనమ్మ అనే మహిళ నుంచి ఇంటిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. భర్త ఉద్యోగ నిమిత్తం పొదలకూరులో కాపురం ఉంటున్నామన్నారు. తనకు ఇంటిని విక్రయించిన ఆమె అద్దెకు ఉంటామని కోరితే ఇచ్చామన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇంటి పన్ను చెల్లిస్తున్నామన్నారు. అయితే ఈ సంవత్సరం ఇంటి పన్ను చెల్లించేదానికి వెళ్తే ఆ ఇల్లు తన పేరు మీద లేదని, గతంలో తనకు ఇల్లు అమ్మిన మోహనమ్మ అనే మహిళ ఆమె కూతురు వరలక్ష్మి పేరుతో రిజిస్ట్రేషన్ చేసిందన్నారు. 2024 వరకు ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్ ఈసీ నకలు తమ పేరుమీద ఉన్నాయన్నారు. ఇంటి పన్ను వేసే పంచాయతీ సెక్రటరీ బ్రహ్మారెడ్డి కూడా తనకు తెలియకుండానే మోహనమ్మ పేరుతో ఇప్పుడు కొత్తగా పన్ను వేయడం అన్యాయమని తెలిపారు. అందువల్ల దొంగ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన పంచాయతీ కార్యదర్శి, సబ్‌రిజిస్ట్రార్‌పై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ విచారణ జరిపిస్తామన్నారు.

శివాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం



ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో ఉన్న అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వర స్వామి(శివాలయం) ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. చైర్‌పర్సన్‌గా కనుపూరు సులోచన, ధర్మకర్తలుగా బుడ్డాబత్తిన నారాయణరావు, ముసలి ప్రభావతి, మర్లపాటి అమ్మణ్ణి, చందులూరు సురేష్, గంపల వెంకయ్య, వల్లూరు సుబ్బారావు, ఇంటూరు శ్రీదేవీ, ఆలయ ప్రధానార్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

విజిలెన్స్ అధికారుల దాడులు



కోవూరు: మండల పరిధిలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేశారు. శాంతి భూషణ్‌రెడ్డి, విష్ణు, దేవసేన బృందం పలు గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. గోదాముల్లో నిల్వ ఉన్న ఎరువులు, పురుగు మందుల స్టాక్‌ను పరిశీలించగా, రిజిస్టర్లు సక్రమంగా నమోదు చేయని కొందరు డీలర్లను గుర్తించి హెచ్చరించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అంతా గందరగోళమే..

నెల్లూరు(టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా డీఎస్సీలో గందరగోళం నెలకొంది. డీఎస్సీ ప్రకటన తరువాత అభ్యర్థులకు ఎక్కువ సమయం ఇవ్వకుండానే పరీక్షల తేదీని ప్రకటించింది. ఫలితాల విడుదల కూడా అంతే గందరగోళ నిర్ణయాలు తీసుకుంటుంది. తొలుత ఈ నెల 22న ఫలితాలను ప్రకటిస్తామని చెప్పినా.. 3 రోజుల తర్వాత ఫలితాలను విడుదల చేశారు. మెరిట్ జాబితా ప్రకారం అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపించకుండానే సోమవారం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుందని ప్రకటించారు. అయితే పొద్దుపోయిన తర్వాత వెరిఫికేషన్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. తాజాగా మళ్లీ 28న ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఆ రోజైనా జరుగుతుందా అనే సందేహం అభ్యర్థుల్లో ఉంది.

వివరాలు లేవు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక అభ్యర్థికి ఒక పోస్టు మాత్రమే అని ప్రకటించారు. అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపకుండానే సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుందని హడావుడిగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. జిల్లాలో 673 పోస్టులకు 31 వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నాన్ లోకల్ అభ్యర్థులు కూడా ఉన్నారు. ఆయా సబ్జెక్ట్‌ల్లో నాన్ లోకల్ అభ్యర్థులు అత్యధిక మార్కులు సాధించారు. అయితే ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి నాన్ లోకల్ అభ్యర్థులు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఏపీ సబ్జెక్ట్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖ వద్ద వివరాలు లేవు.

కండలేరులో 32.360 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 32.360 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల నుంచి కండలేరుకు 9,350 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,200, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని తాటిపర్తిపాళెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం బైక్‌పై గొలగమూడిలో జరిగే ఆరాధనోత్సవాలకు వెళ్లారు. తిరిగి తాటిపర్తిపాళెం వెళ్తుండగా.. తిక్కవరప్పాడు పొలాల సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొనడంతో ఇద్దరూ కింద పడి గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

యువకుడిపై దాడి

పొదలకూరు: మండలంలోని చాటగొట్ల గ్రామానికి చెందిన కండే సురేష్‌పై అదే గ్రామానికి చెందిన వంశీ మరో ఇద్దరు కలిసి సోమవారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్టు పోలీసులు తెలిపారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. సురేష్ గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపడుతుండగా అక్కడికి వెళ్లి నిందితులు రాడ్డుతో తలపై కొట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వారికి పోలీసులే సహకరిస్తున్నారు'

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం రూరల్ ప్రాంతాలతోపాటు, నగర పంచాయతీలోని పలు ప్రాంతాల్లో చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేసేందుకు పోలీసులే సహకరిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. దీనికి బలం చేకూర్చే విధంగా మూడు రోజుల క్రితం రాత్రిపూట దామరమడుగు వద్ద గస్తీలో ఉన్న పోలీసులు చికెన్ వ్యర్థాలతో వచ్చిన వాహనాన్ని స్టేషన్‌కు తరలించకుండా బేరం కుదుర్చుకున్నారు. దాదాపు రూ.70 వేలు వారి నుంచి వసూలు చేసినట్టు సమాచారం. దీనిపై బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా నగదు వసూలు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరుపుతున్నామని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని వివరించారు.

నివేశన స్థలం మంజూరుకు వినతి



కొడవలూరు: నివేశన స్థలం మంజూరు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బసవాయపాళేనికి చెందిన ఆంజనేయులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేక అవస్థలు పడుతున్నామన్నారు. అనేక పర్యాయాలు వినతులు సమర్పించినా స్థలం మంజూరు చేయలేదన్నారు. నిరుపేదలమైన మాకు స్థలం కేటాయించి ఆదుకోవాలని కోరారు. తహసీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి సమాధానమిస్తూ నివేశన స్థలాలపై ప్రభుత్వాదేశాలు వచ్చిన వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

ఎస్‌ఎస్‌ఏ అడిషనల్ పీడీ పరిశీలన



కొడవలూరు ఆదర్శ పాఠశాలలో అసెస్మెంట్ బుక్స్ పరిశీలిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కొడవలూరు: మండలంలోని పలు పాఠశాలలను ఎస్ఎస్ఏ (సమగ్ర శిక్ష అభియాన్) అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్‌లో పీఏఎల్ ల్యాబ్‌ను సందర్శించారు. అనంతరం కొడవలూరులోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అసెస్మెంట్ బుక్స్ పరిశీలించారు. విద్యార్థులతో అసెస్మెంట్ బుక్స్ బాగా రాయించడంతో పాటు బాగా కరెక్షన్ చేసి ఉండడంతో ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణను అభినందించారు. చివరిగా భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేకావసరాల పిల్లల బోధనా పద్ధతులను ఆరా తీశారు. ప్రత్యేకావసరాల పిల్లల్లో పురోభివృద్ధిని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, ఏపీఓ ప్రసాద్, కొడవలూరు హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణ ఉన్నారు.

కోలాహలంగా వినాయకుని విగ్రహాల తరలింపు



పొదలకూరు: వినాయక చవితి సందర్భంగా పొదలకూరు పట్టణం నుంచి గ్రామాలకు సోమవారం బొజ్జ గణపయ్య విగ్రహాలను కోలాహలంగా తరలించారు. పండగకు ముందురోజు మంగళవారం రావడంతో సోమవారమే కొందరు యువకులు తమ గ్రామాలకు విగ్రహాలను తీసుకెళ్లారు. పట్టణంలోని నెల్లూరు రోడ్, పద్మావతి నగర్‌లో విగ్రహాలను తయారు చేశారు. క్రేన్లను ఉపయోగించి బొమ్మలు దెబ్బతినకుండా ఆటోలు, ట్రాక్టర్లలో పెట్టుకుని తరలించారు.

జాగ్రత్తగా జరుపుకోవాలి

కోవూరు: వినాయక చవితి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా జరుపుకోవాలని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ వినాయకుని విగ్రహాలను మండపాలకు తీసుకెళ్లే క్రమంలో విద్యుత్ వైర్లకు తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కరెంట్ నిలిపివేసిన తర్వాతే విగ్రహాలను తరలించాలని సూచించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో తాత్కాలిక లైటింగ్ సౌకర్యాల ఏర్పాటుకు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్సై హనీఫ్

పొదలకూరు: వినాయ చవితి సందర్భంగా పట్టణం, గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఎస్సై ఎస్కే ఎండీ హనీఫ్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఊరేగింపు సందర్భంగా డీజేలు, లౌడ్ స్పీకర్లు, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇల్లు దగ్ధం.. వీధిన పడిన కుటుంబం



కాలిపోయిన ఇంటి వద్ద బాధిత కుటుంబం

మనుబోలు: ఇల్లు కాలిపోవడంతో ఓ కుటుంబం వీధిన పడింది. ఈ ఘటన మండలంలోని కట్టువపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని దళితవాడకు చెందిన తలారి మీరమ్మ తన తమ్ముడి కుటుంబంతో కలిసి చుట్టూ ఇదవలతో వేసిన రేకుల ఇంట్లో ఉంటోంది. అందరూ కూలీ పనులకు వెళ్లగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగు వారు వచ్చి మంటల్ని ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే ఇల్లు, అందులోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఇల్లు నిర్మించుకునేందుకు దాచుకున్న రూ.2 లక్షల నగదు, ఆరు సవర్ల బంగారు నగలు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

మోసం చేశారు.. న్యాయం చేయండి



మాట్లాడుతున్న బాధితులు

నెల్లూరు రూరల్: హైదరాబాద్‌కు చెందిన వివిడ్ లెర్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు లాభాలు వస్తాయని మాతో డబ్బులు కట్టించుకుని మోసం చేశారని, తమకు న్యాయం చేయాలని నెల్లూరుకు చెందిన సుబ్బరాయుడు, హసీన, మాల్యాద్రి, సునీల్‌కుమార్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కంపెనీ సీఈఓ రాజశేఖర్‌రెడ్డి, ఎండీ సౌందర్య భార్గవి, డైరెక్టర్లు కలిసి మీకు లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పి అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. పది మంది దాదాపు రూ.1.50 కోట్లు పెట్టుబడిగా పెట్టామని తెలిపారు. అయితే లాభాలకు సంబంధించిన లెక్కలు చెప్పకపోవడంతో ఆ కంపెనీ వద్దకు వెళ్లి విచారించగా మూసేశారన్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం లేదన్నారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.